యాదాద్రిలో సంప్రదాయ ఆరాధనలు


శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో మంగళవారం పంచ నారసింహులకు నిత్య ఆరాధనలతో పాటు క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామిని కొలిచే ప్రత్యేక పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. గర్భాలయంలోని మూలవరులకు గోవుపాలతో నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను హారతితో కొలిచారు. దర్శన మూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం నిర్వహించారు. అలంకార మూర్తులను గజ వాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని జరిపారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రి వేళ గర్భాలయంలో ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. ఉపాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి వేద, మంత్రాలతో తమలపాకులతో అర్చన జరిపారు. ఆర్జిత కైంకర్యాన్ని విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. సహస్ర నామార్చన జరిపారు. పాత గుట్టలోనూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నిత్యపూజలు, పుష్కరిణి వద్ద ఆంజనేయ ఆరాధన తమలపాకులతో నిర్వహించారు. కొండపైన శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల ఆరాధనలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. మంగళవారం వివిధ విభాగాల ఆలయ ఖజానాకు రూ. 21,99,248 చేకూరింది.

వరదొస్తే రాకపోకలు బంద్

▢ చిన్నేరు వాగు వంతెనపై దిమ్మెలు లేక అవస్థలు


రక్షణ దిమ్మెలు లేని లోలెవల్ వంతెన

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:

భువనగిరి మండలం అనాజిపురం- జంపల్లి రోడ్డు మార్గంలోని చిన్నేరు వాగుపై వంతెన శిథిలావస్థకు చేరింది. రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఇరువైపులా ప్యారాపెట్‌వాల్(రక్షణ దిమ్మెలు)లు లేవు. వర్షం పడితే చాలు ఈ మార్గం గుండా వెళ్లే వివిధ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిందే. సుమారు 15 గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచి రాకపోకలు జరుపుతారు. భారీ వర్షం కారణంగా మూసీనీరు ఈ కాల్వలో చేరడంతో అలుగుపోసి రోడ్డంతా జలమయం అవుతుంది.

★ నీటి ఉద్ధృతి పెరిగినప్పుడు ఈ మార్గంలో వెళ్లకుండా దారులు మూసి వేసి వరద తగ్గిన అనంతరం తిరిగి రాకపోకలు కొనసాగిస్తారు. ఈ సమయంలో వివిధ గ్రామాల ప్రజలు భువనగిరి వెళ్లాలన్నా, అనాజిపురం తదితర గ్రామాల నుంచి తండాలకు వెళ్లాలన్నా సుమారు 20 కి.మీ. ప్రయాణం చేయాల్సి వస్తుంది. రోడ్డు కనపడకపోవడం, రక్షణ దిమ్మెలు లేకపోవడంతో గతంలో కాల్వలో కొట్టుకుపోయి ఆరుగురు మృతి చెందారు.

★ గతేడాది కురిసిన వర్షాలకు రోడ్డును రెండు నెలల పాటు మూసి వేశారు. నీటి ప్రవాహం తగ్గినా నీటి నిల్వతో నాచు పట్టడంతో పాదచారులు ఎందరో జారి పడిపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రజలు కష్టాలు తీరాలంటే లోలెవల్ వంతెనను హైలెవల్ వంతెనగా మార్చడమే మార్గం. గత ప్రభుత్వంలో అనేక సార్లు సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యేకు మొరపెట్టుకోగా అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పంచాయతీరాజ్ నిధులు రూ. 25 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. వర్షం ధాటికి పరిస్థితి అలాగే మారింది.


ప్రమాదకరంగా గుంత

ఇసుక తోడేశారు..

– బాలునాయక్, విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్



వాగుకు ఆనుకొని మా వ్యవసాయ బావి ఉంది. చిన్నతనంలో ఇక్కడి చెలిమె తీసి వాగు నీరు తాగే వాళ్లం. కాల్వ ఇసుకను గతంలో కొంతమంది భారీ ఎత్తున తవ్వకాలు జరిపి తరలించారు. పూర్తిగా ఇసుకే లేకుండా చేశారు. వర్షం పడితే నీటి ఉద్ధృతి పెరిగి రోడ్డు పైకి వస్తున్నాయి.

‘ఈనాడు’ కథనాలతో..

చిన్నేరు వాగుపై శిథిలంగా మారిన లోలెవల్ వంతెనతో ప్రజలు పడుతున్న కష్టాలను ఆగస్టు 17న ‘వంతెన కావాలి.. మంత్రి గారూ!’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. వారి ఆదేశాల మేరకు జిల్లా అధికారి ఈఈ బాలప్రసాద్, డీఈ సుగంధర్, ఏఈఈ సైదులు వాగు వద్దకు వెళ్లి పూర్తి స్థాయిలో సర్వే జరిపి యుద్ధప్రాతిపదికన రూ.16 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ముఖ్యమంత్రి కార్యాలయం 2019 వరకు జిల్లాలో కొత్త, పాత పనులు వివరాలు సైతం సేకరిస్తున్నట్లు సమాచారం. సెప్టెంబరు 6న ‘చిన్నేరు పొంగితే చిక్కులే’ శీర్షికన మరో కథనం ప్రచురితమైంది. ఈ వంతెన నిర్మాణంలో మంత్రి చొరవ ఆశాజనకంగా ఉండటంతో నిధులు త్వరలోనే మంజూరవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం

–సైదులు, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ

‘ఈనాడు’లో కథనం ప్రచురితం కావడంతో మంత్రి, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వెంటనే మా అధికారులకు ఆదేశాలివ్వడంతో ఈఈ, డీఈలతో కలిసి వంతెనను సందర్శించాం. పూర్తి స్థాయిలో సర్వే చేసి ప్రస్తుత ధరలను బట్టి రూ.16 కోట్ల అంచనా వ్యయంగా నిర్ధారించి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో నిధులు వస్తాయని ఆశిస్తున్నాం. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

నల్గొండకు మహర్దశ

○ రూ.516 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అనుమతి
○ తప్పనున్న ట్రాఫిక్ ఇక్కట్లు


బైపాస్‌గా విస్తరించనున్న హౌసింగ్‌బోర్డుకాలనీ రోడ్డు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:


నల్గొండ, సూర్యాపేట జిల్లాల ప్రజలు, వ్యాపారుల కల నెరవేరనుంది. జాతీయ రహదారి-565లో నకిరేకల్-నాగార్జున సాగర్ మార్గంలో నల్గొండ పట్టణం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మహారాష్ట్రలోని సిరోంచ నుంచి మొదలు వయా నకిరేకల్, నల్గొండ, నాగార్జునసాగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి, చిత్తూరు వరకు జాతీయ రహదారి నెంబరు 565 నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మూడు రాష్ట్రాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారిలో నల్గొండ పానగల్ కూడలి నుంచి 14 కి.మీ మేర నాలుగు వరసల బైపాస్ రహదారి నిర్మాణానికి రూ. 516 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదిక ద్వారా ప్రకటించారు. బైపాస్ నిర్మాణంతో వాహనదారులకు మరింత రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.

మారనున్న రూపురేఖలు

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల అనుసంధానానికి జాతీయ రహదారి-565 కీలకమైనది. ఈ దారిలో నాలుగు వరసల బైపాస్ నిర్మాణంతో నల్గొండ రూపురేఖలు మారనున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే పట్టణంలో వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరనుంది. నల్గొండ, చండూరు, మునుగోడు, కనగల్, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, మాల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు రవాణా సౌకర్యం మరింత సులువుకానుంది. నకిరేకల్-నాగార్జున సాగర్ దారిలో సురక్షితమైన ప్రయాణానికి దోహదం చేస్తుంది. నల్గొండ పురపాలిక పరిధిలో వెనుకబడిన ప్రాంతాలైన పాతబస్తీ, మామిళ్లగూడ, మర్రిగూడ, పానగల్, కతాలగూడ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

నాలుగు వరసల రోడ్డుకు ప్రతిపాదన ఇలా..

నకిరేకల్-మాచర్ల సెక్షన్ పరిధిలో నల్గొండ పట్టణంలో గత పదేళ్లుగా జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారులు మొర పెట్టుకున్నా ఆలకించే వారు కరవయ్యారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ. 700 కోట్ల ప్రతిపాదనలతో బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరిన విషయం విదితమే. మంత్రి అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఫిబ్రవరిలో పచ్చజెండా ఊపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ నిర్మాణానికి మూడు మార్గాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనల పంపించారు. అందులో పానగల్ ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం నుంచి వయా పానగల్, మర్రిగూడ మీదుగా హౌసింగ్‌బోర్డుకాలనీ, సంతోష్‌నగర్, కతాలగూడ, గంధవారిగూడెం, ఎస్‌ఎల్‌బీసీ మెడికల్ కళాశాల వరకు 14 కి.మీ. మేర నాలుగు వరసల బైపాస్ రోడ్డు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రోడ్డు అలైన్‌మెంటు విడుదల కావడంతో నిర్మాణ పనులకు అవసరమైన కసరత్తు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. భూసేకరణకు అవసరమైన సర్వే ఇప్పటికే ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు ఎనిమిది కి.మీ మేర సర్వే పూర్తి చేశారు.


ప్రతిపాదిత రోడ్డు

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారులు మంగళవారం వెన్నెల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నూతనంగా నియమితులైన వారికి పాఠశాలలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులను డీఈవో సత్యనారాయణ, ఏడీ ప్రశాంత్‌రెడ్డిలు అందజేశారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ మధ్యాహ్నం తదుపరి ప్రారంభమైంది. తొలుత స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియారిటీ ప్రకారం ఆయా ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 85 మంది స్కూల్ అసిస్టెంట్లకు, 18 మంది భాషా పండితులకు, ఇద్దరు పీఈటీలు పాఠశాలలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. రాత్రి ప్రారంభించిన కౌన్సెలింగ్‌లో 132 మంది ఎస్జీటీలకు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. వీరి కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది.


ఉపాధ్యాయునికి పోస్టింగ్ ఉత్తర్వును అందజేస్తున్న డీఈవో సత్యనారాయణ, ఏడీ ప్రశాంత్‌రెడ్డి

కృష్ణశిల గోపురం చెంతన కరిమేఘం

కుంభవృష్టి కురిపించేలా ఆకాశంలో పోగైన కరిమేఘాలు.. మంగళవారం పట్టణంలో కనిపించాయి. అయితే ఓ మోస్తరు వర్షం కురిపించి వెళ్లిపోవడంతో జనాలు హమ్మయ్య అనుకున్నారు. మేఘావృతమైన ఆకాశం మాదిరిగానే అదే రంగులో ఉన్న కృష్ణ శిలతో చేసిన యాదాద్రి వైకుంఠ ద్వార గోపురం ఇలా కనువిందు గొలిపింది.

– యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే:



ధాన్యం కొన్న మూడ్రోజులకు చెల్లింపులు

భువనగిరి, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏఈవోలు, డీపీఎంలు, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని, అందుకోసం జిల్లాలో మొత్తం 369 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 322 దొడ్డు రకం, 47 సన్నరకం వరి ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతులకు చెల్లింపులు చేయాలన్నారు. సన్నరకం, దొడ్డు రకానికి వేర్వేరుగా రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. రిజిస్టర్‌లో రైతుల పేరు, ఫోన్ నెంబర్, సమయం, స్థలం, సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఐకేపీ సెంటర్లలో రైతులకు అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, డయల్ గ్రెయిన్ క్యాలిబర్లు, చెక్‌పోస్టులు, టోకెన్ల జారీ, వెయింగ్ మిషన్, ప్యాడీ క్లీనర్లు, ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై ఏవైనా సమస్యలు తలెత్తితే రైతులు టోల్‌ఫ్రీ నెంబర్లు 79951 20554కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, డీసీఎస్‌వో వనజాత, డీఎం సీఎస్ జగదీష్‌కుమార్, డీపీఎం సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

◆ పంచాయతీలు, పురపాలికల్లో నియామకానికి కసరత్తు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించనుంది. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ. 5 లక్షలు చెల్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియామకానికి అధికారులు గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నారు.

వీరికి స్థానం

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 12 నియోజకవర్గాలు, 1784 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 42 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపట్టారు.

★ గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున, పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీల్లో భాగస్వాములవుతారు.

★ పురపాలక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది.



కమిటీల్లో సభ్యులు

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీలు: 1784	ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు: ఏడుగురు
మొత్తం సభ్యులు: 12,488 మంది	పురపాలికలు: 17
365 వార్డుల్లో కమిటీ సభ్యులు: 2,555 మంది	

నిబంధనలు ఇలా..

☛ కమిటీ సభ్యులు పేద, మధ్య తరగతి వారై ఉండాలి.
☛ జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి.
☛ అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం
☛ ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం.
☛ సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

ఇంతింతై.. ఎదిగారిలా..!

★ న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న మహిళలు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా బార్ అసోసియేషన్ హాల్

ఇతర వృత్తులతో పోల్చితే న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకుంది. దశాబ్దకాలం క్రితం న్యాయవాద వృత్తిలోకి వచ్చే మహిళలు చాలా తక్కువగా ఉండేవారు. ఇంజినీరింగ్, ఫార్మసీ రంగాలతో పాటు ప్రస్తుతం న్యాయ విద్యపై యువతులు, మహిళలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా నుంచి న్యాయవాద విద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటర్మీడియట్ అయిపోయిన తర్వాత ఐదేళ్ల లాకోర్సు, గ్రాడ్యుయేషన్ అయిపోయినవారు మూడేళ్ల లా కోర్సు చేసి న్యాయవాద వృత్తిలోకి అడుగుపెడుతున్నారు. గతంలో ఆరుగురు న్యాయవాదులు మాత్రమే ఉన్న జిల్లా కోర్టులో ప్రస్తుతం 25 మహిళా న్యాయవాదులు ఉన్నారు. గత నాలుగేళ్ల కాలంలో 15 మందికిపైగా ఈ వృత్తిలోకి వచ్చారంటే ఈ వృత్తిపై పెరుగుతున్న ఆసక్తి తెలుస్తోంది. జిల్లా కోర్టుతో పాటు రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట కోర్టులో 10 మంది వరకు ప్రాక్టీస్ చేస్తున్నారు. హక్కులను కాపాడుతూ సామాజిక ఇంజినీర్లుగా భరోసా ఇచ్చేందుకు ఈ వృత్తిలో వచ్చామని, సామాజిక సేవా దృక్పథంగా బాధ్యతలు నిర్వర్తిస్తామని అంటున్నారు ఈ న్యాయవాదులు.

'న్యాయవాదిగా 2001లో భువనగిరి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఇద్దరు మాత్రమే మహిళా న్యాయవాదులు ఉండేవారు.. జిల్లా కోర్టులో ప్రస్తుతం న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళల సంఖ్య చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.. ఇతర రంగాలతో సమానంగా న్యాయవాద వృత్తిలో మహిళలు ఎదగడం, మగువలకు ప్రత్యేక బార్ అసోసియేషన్ హాల్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం.. ఈ వృత్తిలో రాణించేందుకు ఎప్పటికప్పుడు చట్టాలపై పట్టు సాధించి ఎదగాలి..'

– భువనగిరి కోర్టులో మహిళా బార్ అసోసియేషన్ ప్రారంభం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ కె.సుజన అన్న మాటలివి.

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే:

అసమానతలు ప్రశ్నించేందుకే

– కె.జయ, ఉపాధ్యక్షురాలు, భువనగిరి బార్ అసోసియేషన్



చిన్నతనంలో వివాహమైనా కుటుంబాన్ని పోషిస్తూ చదువు కొనసాగించా. ఓ స్వచ్ఛంద సంస్థలో ఆర్గనైజర్‌గా పని చేస్తున్న సమయంలో మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచార ఘటనలు, ఎస్సీ, ఎస్టీలకు జరిగే సామాజిక అన్యాయం, అసమానతలు ప్రశ్నించేందుకు న్యాయశాస్త్ర విద్యనభ్యసించా. 2009లో న్యాయవాద వృత్తిలో అడుగు పెట్టాను. మహిళలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నాను.

నిరంతర కృషి ఉంటేనే

– చందుపట్ల రజని, న్యాయవాది

న్యాయవాద వృత్తిలో పురుషులతో సమానంగా మగువలు ముందుకు వస్తున్నారు. వృత్తిలో ప్రారంభంలో ఇబ్బందులు ఉన్నా రాణించేందుకు నిరంతరం కృషి ఉండాలి. మహిళలు ఇటువైపు వచ్చేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. 2005లో న్యాయవాద వృత్తిలోకి వచ్చాను. ఇతర రంగాలతోపాటు గౌరవ ప్రదమైన న్యాయవాద వృత్తిలో వచ్చేవారి సంఖ్య పెరిగింది. చాలా మంది స్త్రీలు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారు. అలాంటి వారికి అండగా ఉంటాం.

సామాజిక సేవే దృక్పథంగా:

– బి.సుమలత, సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్



వివాహమైన తర్వాత పట్టుదలతో ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. 2022లో న్యాయవాదిగా సామాజిక సేవా దృక్పథంలో భువనగిరి సఖీ కేంద్రం లీగల్ కౌన్సెలర్‌గా చేరాను. సఖీ కేంద్రంలో ఆశ్రయం పొందిన వేధింపులు, అత్యాచార బాధితులు, వరకట్న బాధితుల కేసులను వాదిస్తున్నాను. వారితో మమేకమై సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను.

మామయ్య ప్రోత్సాహంతో

– చేగూరి సరిత, జూనియర్ న్యాయవాది



ఇంజినీరింగ్ పూర్తి చేశాను. వివాహమైన తర్వాత మా మామయ్య నాగారం అంజయ్య ప్రోత్సాహంతో న్యాయవిద్యను పూర్తి చేశాను. గతేడాది నుంచి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసేందుకు వస్తున్నాను. అతివల హక్కులు కాపాడేందుకు, వృత్తిలో రాణించేందుకు కృషి చేస్తున్నాను.

వృథాను అరికడదాం.. అభాగ్యుల ఆకలి తీరుద్దాం

మిర్యాలగూడ పట్టణం,సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:



దుక్కిదున్ని, నారుమడి సిద్ధం చేసి.. విత్తనాలు విత్తితే మొలకెత్తడానికి వారం రోజుల సమయం పడుతుంది. నారు ఎదిగేందుకు.. నాటుకు 25 రోజులు.. ఎరువులు చల్లి.. కలుపు తీసి.. సస్యరక్షణ చేపడితే కొద్ది రోజులకు సన్న వడ్లు చేతికి వస్తాయి.. ఇలా విత్తనం.. వరిగింజగా మారడానికి అన్నదాత 95 రోజులూ స్వేదం చిందించి శ్రమించాల్సిందే.

అన్నదాత అంత కష్టపడి.. వర్షాల నుంచి పంటను కాపాడి.. అన్నాన్ని చేతికిందిస్తే.. శుభకార్యాలు, హోటళ్లల్లో నిత్యం కిలోల కొద్దీ ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి పట్టణాల్లో అభాగ్యులు, పేదలు ఆహారం కోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నారు. ఇలాంటి వారి ఆకలిని తీర్చడానికి ఐక్యరాజ్యసమితి ఆహార భద్రత కోసం 1945 అక్టోబరు 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ'ను ఏర్పాటు చేసింది. ఆ రోజు గుర్తుగా ఏటా మాదిరిగానే బుధవారం జరుపుకొనే 'ప్రపంచ ఆహారం దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

★ నేడు 'ప్రపంచ ఆహార దినోత్సవం'



స్వచ్ఛంద సంస్థల కృషి ఇలా..

ఆహార వృథాను అరికట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. టీఎన్‌బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో మిగిలిన ఆహార పదార్థాలను పెట్టేందుకు ఓ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేక తొలగించారు. సూర్యాపేటలోనూ ఇదే పరిస్థితి.

★ మిర్యాలగూడకు చెందిన ఆకుల కృష్ణంరాజు, అవిరెండ్ల సందీప్ మిత్రబృందాలు, నల్గొండకు చెందిన అమ్మ ఫౌండేషన్ రేఖ, ఆపద్బాంధవ ఫౌండేషన్ సంజు, చౌటుప్పల్‌కు చెందిన ఆయాన్ భార్గవ్ ట్రస్టు మురళి, సూర్యాపేటకు చెందిన మదర్ థెరిసా ఫౌండేషన్ జానీపాషా తదితరులు ఆహార వృథాను అరికట్టేందుకు శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంచుతూ తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

- ☛ దేశంలో ఒక్కో వ్యక్తి సగటున ఏటా 55 కిలోల ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు.
- ☛ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే ఆహార వృథా అధికం.
- ☛ దేశంలో సుమారు 14.3శాతం మంది తగిన పోషకాలు అందక బాధ పడుతున్నారు.
- ☛ ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు పోషకాహార లోపమే కారణమని ఐసీఎంఆర్ హెచ్చరించింది.

ఒక్క మెతుకునూ వదిలిపెట్టం

– ధనావత్ శివ, రైతు, మాటూరు, త్రిపురారం మండలం



గత 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. ఆరుగాలం శ్రమించి పంటను పండించడం ఎంతో కష్టమైన పని. మేము వ్యవసాయాన్ని దైవంగా భావిస్తూ.. పంటను ఎంతో ప్రేమిస్తాం. కష్టపడి పండించిన ఆహారాన్ని ఇటీవల అనేక మంది వృథా చేస్తుంటే ఎంతో బాధ కలుగుతుంది. మేము అన్నం తినేటప్పుడు కింద ఒక్క మెతుకు పడితే దాన్ని కూడా తీసుకుని కంచంలో వేసుకుంటాం. ఆహార వృథాను కాపాడేందుకు ప్రభుత్వాలు సైతం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఏడేళ్లుగా అన్నదానాలు

–దైద నాగరాజు, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నార్కట్‌పల్లి

నిత్యం అనేక మంది ఆకలితో అలమటిస్తున్నారు. వారి ఆకలి తీర్చేందుకు గత ఏడేళ్లుగా నార్కట్‌పల్లి, పరిసర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆరు నెలల క్రితం 'మనం ఫౌండేషన్' పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి నిత్యం వంద మందికి, సంత జరిగే శుక్రవారం 200 మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.



రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

కోదాడ, న్యూస్‌టుడే: అపసవ్య దిశలో వెళ్తున్న స్కూటీని డీసీఎం వాహనం ఢీకొనడంతో ఓ యువతి మృతి చెందిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నయానగర్‌కు చెందిన పలివెల నాగజ్యోతి(18) ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ఇంటర్ చదువుతోంది. బంధువుల స్కూటీ తీసుకొని పట్టణంలోని హుజూర్‌నగర్ పైవంతెన మీది నుంచి అపసవ్య దిశలో విజయవాడ వైపునకు వెళ్తుంది. అదే క్రమంలో విజయవాడ వైపు నుంచి డీసీఎం వాహనం వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో నాగజ్యోతి తలకు తీవ్ర గాయాలై మరణించింది. తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. యువతి ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోందని, దీంతో స్కూటీ మీద అపసవ్య దిశలో వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: పట్టణంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాలపై ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి మంగళవారం నల్గొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు, శానిటేషన్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. 16న ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 17న గంధం ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఆర్డీవోలు, డీఎస్పీలు ఉర్సు ఉత్సవాలు పర్యవేక్షించాలన్నారు. ఉర్సు ఉత్సవాలు జరిగే చోట తాగునీరు, శానిటేషన్‌ను నల్గొండ పుర కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి మిషన్ భగీరథ ఎస్ఈలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ. . ఉర్సు ఉత్సవాలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సంబంధిత అధికారులు అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు జరిగే చోట పార్కింగ్, క్యూలైన్‌ల ఏర్పాటు, బారికేడింగ్ వంటివి ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో బందోబస్తుకు గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నల్గొండ పుర కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు

ఆర్టీసీకి దసరా లాభాల పంట

సూర్యాపేటలో అత్యధికం.. నార్కట్‌పల్లిలో అత్యల్పం



★ రెండు వారాల్లో రూ. 24.35 కోట్ల ఆదాయం రాక

మిర్యాలగూడ పట్టణం, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

దసరా పర్వదినం ఆర్టీసీ సంస్థకు లాభాలు తీసుకొచ్చింది. విజయ దశమి సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చేందుకు ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఈ నెల 2 నుంచి 646 ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ రెండు వారాల్లో మొత్తం 35.19 లక్షల కిలోమీటర్ల దూరం బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీ సంస్థ రూ.24.35 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. సాధారణం కంటే రెట్టింపు ఆదాయం రావడంతో అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దసరా రద్దీ మరో రెండు, మూడు రోజులు కొనసాగనున్న నేపథ్యంలో ఆదాయం మరింత వచ్చే అవకాశం ఉంది. ఆదాయం సాధించడంలో ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట డిపో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు వారాల్లో రూ.4.76కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఆ తర్వాత దేవరకొండ, మిర్యాలగూడ డిపోలున్నాయి. నార్కట్‌పల్లి డిపోకు రూ.47.42 లక్షలే వచ్చాయి.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం


రెండు వారాల్లో రీజియన్ వ్యాప్తంగా 117 ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) నమోదు కాగా.. ఈ నెల 14న అత్యధికంగా 146.12 ఓఆర్‌తో నల్గొండ రీజియన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ రోజు రూ.2.26 కోట్ల ఆదాయం సమకూరింది. ఆ రోజు రీజియన్ లక్ష్యం రూ.146.27 కోట్లు కాగా.. రాష్ట్రంలోనే అత్యధికంగా 178 శాతం అదనపు ఆదాయాన్ని సాధించింది.

మహాలక్ష్మిలే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 36.24 లక్షల మంది ప్రయాణించగా.. వీరిలో మహిళా ప్రయాణికులు 22.1 లక్షలు, డబ్బులు చెల్లించి ప్రయాణించిన వారు రూ. 14.14 లక్షల మంది ఉన్నారు. మొత్తం ఆదాయంలో మహాలక్ష్మి పథకం ద్వారా వచ్చిన రాబడి రూ.11.99 కోట్లు. డబ్బు చెల్లించి ప్రయాణించిన వారి ద్వారా రూ.12.35కోట్ల ఆదాయం వచ్చింది.

అదనపు సర్వీసులు నడిపించడంతో..

– రాజశేఖర్, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ.



బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ముందస్తు ప్రణాళికతో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అదనపు సర్వీసులు నడిపించాం. దీంతో రెండు వారాల్లో రూ.24కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

అక్టోబరు 1 నుంచి 14 వరకు డిపోల వారీగా ఆదాయ వివరాలు..

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.కోట్లలో)	ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో)
సూర్యాపేట	6,20,302	4.76	126
దేవరకొండ	5,97,579	4.39	122
మిర్యాలగూడ	5,98,473	4.03	109
నల్గొండ	6,54,076	3.94	103
కోదాడ	4,86,022	3.33	111
యాదగిరిగుట్ట	4,95,160	3.40	130
నార్కట్‌పల్లి	67,650	0.47	121

కారు బోల్తా.. యువకుడి దుర్మరణం

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి వరంగల్ జాతీయ రహదారిపై కారు బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద కందుకూరు స్టేజీ వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన వీరమల్లు వినీత్(17) అతని నలుగురు స్నేహితులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. మండలంలోని పెద్ద కందుకూరు స్టేజీ వద్దకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్ల పొదల్లో బోల్తాపడింది. దీంతో వినీత్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతావారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కూలీ బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యం ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలోని గాంధీ నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చెక్క యాదయ్య(60) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. భార్య చెక్క హంసమ్మ స్థానిక మార్కండేశ్వర స్వామి దేవాలయంలో పని చేస్తుంది. ఉదయం హంసమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో యాదయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి విగత జీవిగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిని వెంటాడిన మృత్యువు

★ తమ్ముడిని బస్సెక్కించి వస్తుండగా ఢీకొట్టిన కారు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఆ బాలుడిని మృత్యువు వెంటాడింది. పది రోజుల క్రితం స్వల్ప గాయాలతో బయటపడినా మంగళవారం కారు రూపంలో కబళించింది. దసరా వేడుకల్లో తోటి స్నేహితులు, బంధువుల పిల్లలతో అప్పటివరకు సరదాగా ఆడుకున్నాడు. తమ్ముడితో కలిసి ఉత్సవాలలో ఆనందంగా గడిపాడు. సెలవులు ముగియడంతో తమ్ముడ్ని పాఠశాలకు పంపే క్రమంలో ప్రమాదంలో మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన బెక్కం అశోక్, సుష్మలకు శ్రీరాం(11), సాయిరాం కుమారులు. ఇద్దరూ హుజూర్‌నగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. బస్సులో వెళ్లి వస్తుంటారు. దసరా సెలవులకు ముందు రోజు హుజూర్‌నగర్ నుంచి తండ్రితో ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీరాం పుస్తకాల బ్యాగు జారిపోతుందని పట్టుకోబోయి కింద పడిపోయాడు. అప్పుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అనంతరం సెలవులు రావడంతో ఇంటి వద్దే ఉంటూ పండగ జరుపుకొన్నారు. గాయాలు పూర్తిగా తగ్గక పోవడంతో తాను బడికి వెళ్లలేక మంగళవారం ఉదయం తమ్ముడు సాయిరాంను పాఠశాలకు పంపించడానికి అమ్మమ్మ వెంకటలక్ష్మితో కలిసి స్కూల్ బస్సు దగ్గరకు వెళ్లాడు. బస్సు ఎక్కించి అందులోని తన స్నేహితులను పలకరించి వెనుతిరిగి వస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి వైపు నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్న కారు వేగంగా శ్రీరాంను ఢీకొట్టింది. దీంతో శ్రీరాం తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే హుజూర్‌నగర్‌కు అక్కడి నుంచి కోదాడకు, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. తండ్రి అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చలిగంటి నరేష్ తెలిపారు.


శ్రీరాం

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

గింజ పోసుకునే దశలో నేలకొరిగి

○ అన్నదాతను వణికిస్తున్న వర్షాలు


గరిడేపల్లిలో ఏపుగా పెరిగి గింజ పోసుకుంటున్న వరి

గరిడేపల్లి, కోదాడ, న్యూస్‌టుడే:

ఇటీవల వరసగా వస్తున్న అల్ప పీడనాల వల్ల వస్తున్న వర్షాలు అన్నదాతకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఏ క్షణంలో గాలి దుమారంతో వర్షం పడుతుందో, పంట నేల పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏదో ఒక ప్రాంతంలో వర్షం భారీగా నష్టం మిగుల్చుతుంది. చేతికి వచ్చిన పంట నేలకు ఒరగడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో.. పెట్టుబడి ఎలా రాబట్టుకోవాలో తెలియక దిగులు పడుతున్నారు.

భారీగా నష్టం:

పొలం నేలకొరిగితే భారీగా నష్టం వాటిల్లుతుంది. గింజ పోసుకోక ముందే పడిపోతే 60-70 శాతం, గింజ పోసుకున్న తర్వాత పడితే 30 శాతం దిగుబడి తగ్గుతుంది. దీనికి తోడు వరి యంత్రాలతో కోయిస్తుండటంతో సమయం ఎక్కువగా తీసుకుంటుంది. సాధారణంగా ఎకరం గంట నుంచి గంటా పదిహేను నిమిషాలలో కోస్తే.. పడిపోయిన పొలంలో ఎకరానికి మూడు గంటలకు పైగా సమయం పడుతుంది. అంటే అదనంగా రెండు గంటల సమయం వృథా. అదనపు భారం రూ.ఆరు వేలు. 2022 వానాకాలంలో పొలాలు పడిపోయి భారీగా నష్టం వాటిల్లింది. ఎకరం మూడున్నర గంటల సమయంలో కోశారు. పంట బాగా దెబ్బతింది. ఆ ధాన్యం మిల్లుకు తరలిస్తే అనేక కొర్రీలు పెట్టి క్వింటా రూ. 1,500 నుంచి రూ. 1,800 వరకు కొనుగోలు చేశారు. పొలం పడిపోతే ఎకరానికి రూ.20 వేల నష్టం వాటిల్లుతుంది. అందుకే వానాకాలంలో అకస్మాత్తు వర్షాలతోపాటు గాలులు వీస్తే రైతులకు కన్నీరు వస్తుంది.

అంతా స్వల్పకాలిక సన్నరకాలే

ఇటీవల రైతులు స్వల్పకాలిక వరి వంగడాలనే సాగు చేస్తున్నారు. ప్రైవేటు రకాలైనా, పరిశోధనా స్థానాల నుంచి తెచ్చినవైనా 120-125 రోజుల పంట కాలం ఉండేవి, అందులోనూ సన్నరకాలు ఎక్కువగా ఉన్నాయి. వేసవిలో ఎండల తీవ్రత, వడగండ్ల వానలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగానే వానాకాలం పంట ముగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తక్కువ కాలంలో చేతికి వచ్చే పంటలు సాగు చేస్తున్నారు. ఈ రకాలు ఎత్తు ఎక్కువగా పెరుగుతున్నాయి. సాధారణంగా 90 సెం.మీ. పెరిగే వరి అంతగా పడిపోదు. కానీ ఇప్పుడు సాగు చేస్తున్న రకాలు 130 సెం.మీ. వరకు పెరుగుతున్నాయి. దుబ్బులో బలం లేకపోవడం, గట్టిపడకపోవడం, తెగుళ్లు సోకి దుబ్బు మొదలు కర్రలు బలహీనంగా ఉండటంతో గింజ పాలు పోసుకొని ధాన్యంగా మారుతున్నప్పుడు పైన బరువు ఆపలేక పడిపోతున్నాయి. నత్రజని ఎక్కువగా మొక్కకు అందడంతో ఏపుగా పెరిగాయి. ఇటీవల కురుస్తున్న గాలి వానలకు పొలాలు పడిపోతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పొలాలు పరిశీలించి పరిహారం ఇస్తే కొంతమేరైనా అన్నదాతకు ఆసరా ఉంటుందని ఆశ పడుతున్నారు.

రెండు నెలలే కీలకం..

ఏటా వర్షాలు అక్టోబరు మొదటి వారం నుంచి చివరి వారం వరకు కురుస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా వరి పంట చేతికి వచ్చేది నవంబరులోనే. నవంబరు మొదటి వారం నుంచి డిసెంబరు 15 వరకు కోతలు పూర్తవుతాయి. అంటే అక్టోబరు మొదటి వారం నుంచి చివరి వరకు వరి ఈత దశలో కొంత, ముందుగా నాట్లు వేసినవి గింజ పోసుకునే దశలో మరికొంత ఉంటాయి. దాదాపు 80 శాతం పొలాల్లో దీపావళి వెళ్లిన వారం తర్వాత కోతలు మొదలు పెడతారు. పది శాతం మంది అక్టోబరు చివరి వారంలో ఆరంభిస్తారు. అందుకే అక్టోబరు, నవంబరు రెండు నెలల్లో గాలులు, వర్షాలు లేకుంటేనే పంట చేతికి వస్తుంది.

సాగునీటి కాల్వలకు నిధులు మంజూరు చేయండి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి నియోజకవర్గం పరిధిలోని సాగు నీటి కాల్వలకు నిధులు మంజూరు చేయాలని కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కోరారు. హైదరాబాదులో మంగళవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆ శాఖ ఈఎన్‌సీ చంద్రశేఖర్‌ను వేర్వేరుగా కలిసి కాల్వల పరిస్థితిని వివరించారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.500 కోట్లు మంజూరు చేయాలని కోరారు. బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు రూ.50 కోట్లు, కాలనీలో ఇళ్ల నిర్మాణాల మౌలిక వసతుల కల్పనకు రూ.50 కోట్లు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్‌ను కోరారు. ఆయన వెంట నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుంభం, తదితరులు

సెనగ సాగుపై మెలకువలు

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: సెనగ పంట సాగుపై రైతులకు మంగళవారం స్థానిక రైతువేదిక భవనంలో మెలకువలు, సస్యరక్షణ చర్యలపై ఆలేరు ఏడీఏ పద్మావతి అవగాహన కల్పించారు. రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రైతులతో చర్చించారు. ఏవో పాండురంగాచారి, ఏఈవోలు దయాకర్, నవనీత, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఉన్నా... పట్టు వీడలేదు

☛ ఏఈగా, ఉపాధ్యాయినిగా ఎంపికైన న్యాయశాఖ ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగం ఉన్నా పట్టు వీడలేదు ఆ యువతులు.. చిన్నపటి నుంచి కలలుగన్న లక్ష్యం కోసం శ్రమించారు. తాము అనుకున్న కొలువులను సాధించారు. కొలువుల కోసం సన్నద్ధం అవుతున్న తరుణంలో న్యాయ శాఖ ఉద్యోగులుగా ఎంపికైనా అక్కడితో ఆగిపోలేదు. న్యాయశాఖలో ఉద్యోగం చేస్తూనే తాము కోరుకున్న ఉద్యోగాలను సాధించారు ఆ యువతులిద్దరూ. రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చౌటుప్పల్‌కు చెందిన జెల్ల శిల్ప రికార్డ్ అసిస్టెంట్‌గా, మోత్కూరు చెందిన అవిశెట్టి నవీన ఎగ్జామినర్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. లక్ష్య సాధన కోసం ఉద్యోగంలో ఉంటూ సన్నద్ధమయ్యారు. నవీన టీజీ ట్రాన్స్‌కోలో గెజిటెడ్ హోదా కలిగిన ఏఈ ఉద్యోగానికి, శిల్ప ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన ఇద్దరు యువతులు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కుటుంబాలకు అండగా ఉంటూ తమకు ఇష్టమైన రంగంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. – భువనగిరి గంజ్, న్యూస్‌టుడే:

ఏఈ కావాలనే లక్ష్యంతో: అవిశెట్టి నవీన



మోత్కూరు ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నా. డిప్లొమా హైదరాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలలో, ఈఈఈ ఇంజినీరింగ్ ప్రైవేటు కాలేజీలో 2020లో పూర్తి చేశాను. ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత విద్యుత్తు శాఖలో ఏఈ కావాలనే లక్ష్యంతో సన్నద్ధమయ్యాను. రెండేళ్ల క్రితం న్యాయశాఖలో నియామక ప్రక్రియ పరీక్ష రాశాను. ఎగ్జామినర్‌గా ఉద్యోగంలో చేరినా లక్ష్యం వీడలేదు. పట్టుదలతో ఏఈ పోస్టుకు సన్నద్ధమయ్యాను. టీజీ ట్రాన్స్‌కోలో ఇటీవల ఏఈగా ఎంపికయ్యాను.

ఉద్యోగానికి వెళ్తూనే సన్నద్ధం: జెల్ల శిల్ప



చౌటుప్పల్ గురుకుల పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నా. ఇంటర్ హసన్‌పర్తి గురుకులంలో, నల్గొండ వైట్ కళాశాలలో టీటీసీ 2019 అనంతరం డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగ నియామక పరీక్షలకు సిద్ధమయ్యాను. ఉద్యోగ ప్రయత్నంలో న్యాయశాఖలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యా. ఉద్యోగం చేస్తున్నా డీఎస్సీ కోసం సన్నద్ధమై ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యాను.

ప్రవేశాలకు దరఖాస్తులు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరులోని ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపల్ వి.హరికృష్ణ మంగళవారం చెప్పారు. ఆసక్తిగల వారు ఈ నెల 19 వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకుని నేరుగా ఐటీఐలో ప్రవేశాలు పొందవచ్చని, సంప్రదించి చేసుకుంటే వెంటనే అడ్మిషన్లు ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపల్ 98668 43920ను సంప్రదించాలన్నారు.

గడువు పొడిగింపు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ విద్యానిధి పథకం 2024-25 సంవత్సరం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 29 వరకు ప్రభుత్వం పొడిగించిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఐటీఐ అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంలో ప్రవేశాలు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ఆలేరు ప్రభుత్వ ఐటీఐలోని అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంలో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ హరికృష్ణ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న వారికి ప్రవేశాలు కల్పించి ఆరు కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. సమాచారం కోసం సెల్‌ఫోన్ నంబర్ 98668 43920కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ కమిటీల ఎంపికపై సమావేశం

మోత్కూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను నిబంధనల మేరకు త్వరగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో గ్రామాల్లోని పరిస్థితులపై సమీక్షించారు. ఎంపీడీవో నిరంజన్‌వలి, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో కొనుగోళ్లు చేపట్టండి

భువనగిరి, న్యూస్‌టుడే: సమగ్ర ప్రణాళికతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సహకారశాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈవోలు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా సహకార అధికారి శ్రీధర్, ఆడిట్ అధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

హోటల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి బైపాస్ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం సాయంత్రం ఆహార భద్రతాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాలను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివేరా హోటల్‌లో తనిఖీలు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎం.సుమన్ కల్యాణ్, స్వాతి తెలిపారు.

అద్దె చెల్లించడం లేదని గురుకులానికి తాళం

మోత్కూరు, న్యూస్‌టుడే: తొమ్మిది నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో మోత్కూరులోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల భవన యజమాని సీహెచ్.సత్యం గౌడ్ మంగళవారం గేటుకు తాళం వేశారు. ప్రిన్సిపల్, సిబ్బంది తాళం వేయవద్దని చెప్పినప్పటికీ ఆయన వినలేదు. విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య, తహసీల్దారు రాంప్రసాద్, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, ఎస్సై నాగరాజు పాఠశాల వద్దకు వెళ్లారు. యజమానితో చర్చలు జరిపారు. ఈలోగా మంత్రి పొన్నం ప్రభాకర్ అద్దెలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో, గురుకుల పాఠశాలల అద్దె భవనాల అసోసియేషన్ సమాచారంతో తాళం తీశారు.



మోత్కూరులోని గురుకుల పాఠశాలకు తాళం వేసిన యజమాని

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు.. రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల అద్దె భవనాలకు కిరాయి ఇవ్వడం లేదని భవనానికి తాళాలు వేసి విద్యార్థులను పాఠశాల ముందు నిలబెట్టిన యజమానుల తీరును ఎస్ఎఫ్ఐ ఖండించింది. స్థానిక గురుకుల పాఠశాల గేటు ఎదుట ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా అద్దె చెల్లించకపోవడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని విమర్శించారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

‘భాజపాకు పెరుగుతున్న ఆదరణ’



చౌటుప్పల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న భాజపా రాష్ట్ర కార్యదర్శి జి.ఉమారాణి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: భాజపాకు ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఉమారాణి తెలిపారు. చౌటుప్పల్ హైండ్లూమ్ మార్కెట్ ప్రాంతంలో 36, 37 పోలింగ్ బూత్‌ల పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మంగళవారం పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి భాజపా ఆశయాలు, లక్ష్యాలు వివరించి సభ్యత్వం నమోదు చేసి మాట్లాడారు. నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సభ్యత్వ నమోదులో జిల్లాలో మునుగోడు నియోజకవర్గం ముందంజలో ఉందని వెల్లడించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, పురపాలిక కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్దన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, భిక్షమాచారి, వెంకటేశంగౌడ్, ఎడ్ల మహేశ్వర్‌రెడ్డి, ఐలయ్య, గణేశ్, శేఖర్‌రెడ్డి, సురేశ్, శివప్రసాద్ పాల్గొన్నారు.



దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో చదివిన పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

వలిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తు చేసుకొన్నారు. నాటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

కలాం అందరికి ఆదర్శప్రాయుడు



ఆత్మకూరులో కలాం చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య అన్నారు. కలాం జయంతి సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం కలాం చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కడకంచి మల్లయ్య సోమవారం రాత్రి మరణించగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్యాక్స్ ఛైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, నాయకులు కె.నరేందర్ గుప్తా, కె.అనంతరెడ్డి, ఎం.సిద్దులు, జె.నగేశ్ ఉన్నారు.

ఆలేరు: ఆలేరులో మంగళవారం రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి జరిగింది. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాఘవ సంస్థ అధ్యక్షుడు పులిపల్పుల మహేష్, అయిలి సందీప్, గ్యాదపాక నాగరాజు, విష్ణు, ఎం.డి.ఫయాజ్ పాల్గొన్నారు.

మోత్కూరు: మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుంగపట్ల యాకయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

అవీ ఇవీ

పశువులకు ఉచితంగా టీకాలు..

భువనగిరి పట్టణం: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. రెండో విడుత గాలికుంటు వ్యాధి నిరోధక నివారణ కార్యక్రమం కింద 14.11.2024 వరకు టీకాలు వేస్తున్నామని అన్నారు. జిల్లాలో 164400 గోజాతి, బర్రె జాతి పశువులు ఉన్నాయని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి.. రామన్నపేట: పశు వైద్య క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి జ్యోత్స్న కోరారు. మండలంలో ఇంద్రపాలనగరంలో ఏర్పాటు చేసిన పశు వైద్య క్యాంపులో ఆమె మాట్లాడారు. గాలి కంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం అక్టోబరు 15 నుంచి నవంబరు 14 వరకు పల్లెల్లో పశువులకు టీకాలు వేయనున్నట్లు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా, సుభాషిని, భాను, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి.. సంస్థాన్‌నారాయణపురం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సీఎం కప్ పోటీల అవగాహన కోసం నిర్వహించనున్న ‘సీఎం కప్ టార్చ్ ర్యాలీ’లో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని స్పోర్ట్స్ క్లబ్ నారాయణపురం వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సైదులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 17న కలెక్టరేట్ నుంచి భువనగిరి కోట వరకు టార్చ్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. టార్చ్ ర్యాలీ జనగామ జిల్లా నుంచి 17న యాదాద్రి జిల్లాకు చేరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

వరంగల్‌లో పుట్టపాక చేనేత వస్త్ర ప్రదర్శన.. సంస్థాన్ నారాయణపురం: వరంగల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్ర హ్యాండ్లూమ్ ఎక్స్పో ప్రదర్శనలో పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ప్రొడక్ట్స్ వారి చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకం మంగళవారం నిర్వహించారు. పుట్టపాక తేలియారుమాల్, సిల్క్ చీరలు, సీకో, కాటన్ చీరలు, సిల్క్ సీకో ఫ్యాబ్రిక్స్, దుపట్టాలు, టాప్స్, కాటన్ బెడ్ సీట్స్ తదితర రకాల వస్త్రాలను విక్రయించినట్టు తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు సామల విజయలక్ష్మీ తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు సామల భాస్కర్, హర్షిత్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ.. భూదాన్‌పోచంపల్లి: పీడీఎస్‌యు అర్ధ శతాబ్ది ఉత్సవాల గోడపత్రికను పీవైఎల్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆ సంఘం పట్టణ కార్యదర్శి పగడాల శివ ఆవిష్కరించారు. వినయ్, కార్తిక్, కిరణ్, మధు, ప్రసన్న, రాకేష్, పల్లవి, నందిని, వర్షిత, శరత్ పాల్గొన్నారు.

సాగునీటి సాధనకు సర్వే.. రాజపేట: మండలంలోని గొలుసుకట్టు చెరువుల్లోకి గోదావరి జలాలతో నింపేందుకు ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు, ఐబీ అధికారులతో స్వీయ పరిశీలన చేశారు. పాముకుంట, మొల్లగూడెం, కుర్రారం, రాజపేట, తపాసుపల్లి ప్రాంతాలను బృందం పరిశీలించారు. ఏ రకంగా అయితే మండలానికి శాశ్వత సాగునీరు అందుతుందనే విషయమై సర్వే చేపట్టినట్లు అన్నారు.

ఎన్నిక.. రాజపేట: మండలంలోని పారుపల్లి జైభీమ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూపతి బాలకిషన్, గౌరవ అధ్యక్షుడిగా రామచందర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, సంయుక్త కార్యదర్శిగా తాళ్లపల్లి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా రాజు, గౌరవ సలహాదారుగా మహేశ్, పెద్ద బాబూరావు, రాజు, సిద్ధులు, సాంస్కృతిక కార్యదర్శిగా బాలరాజులను ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోత్కుపల్లి నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు.

దుర్గామాత శోభాయాత్ర.. భువనగిరి: భువనగిరి మీనానగర్‌లో వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూత్ సభ్యులు సూదగాని రాజు, సన్ని, రాజు పాల్గొన్నారు.

18న సీపీఎం మండల మహాసభ.. తుర్కపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 18న సీపీఎం మండల మహాసభను ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేషం పేర్కొన్నారు. తుర్కపల్లిలో మంగళవారం జరిగిన మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల మహాసభను విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. పోతరాజు జహంగీర్, లింగయ్య, నర్సింహ, మాతయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

ఘనంగా తుల్జభవానీ పండగ.. తుర్కపల్లి: భీల్యానాయక్ తండాలో మంగళవారం తుల్జ భవానీ మాత పండగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐనాల చైతన్యరెడ్డి, తహసీల్దార్ దేశ్య నాయక్, నాయకులు చాడ భాస్కర్‌రెడ్డి, శంకర్‌నాయక్, వెంకటేశ్‌గౌడ్, రాజారామ్, వెంకటేశం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన.. మోటకొండూరు: మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు యాదగిరిగుట్ట గ్రామీణ సీఐ కొండల్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో బ్యాంకింగ్, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను పంచుకోవద్దని సూచించారు. ఎస్సై పాండు, ఏఎస్సై లింగయ్య ఉన్నారు.

అవగాహన.. యాదగిరిగుట్ట అర్బన్: యాదగిరిగుట్ట సీఐ రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని బాహుపేట గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

కేసు నమోదు. భువనగిరి గ్రామీణం: నిబంధనలకు విరుద్ధంగా బాణా సంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఓ పశువుల దాణా దుకాణంలో బాణాసంచా విక్రయిస్తున్నట్లు ఎస్వోటీ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వ్యక్తిపై కేసు నమోదు చేసి, అతని నుంచి రూ.20 వేల విలువ గల పటాసులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి



కొరటికల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో సత్యనారాయణ

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొరటికల్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి 9, 10వ తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు డి.వెంకన్న, ఉపాధ్యాయులు రవి, వరప్రసాద్, శ్రీనివాసాచారి, అనురాధ, వెంకటేశం పాల్గొన్నారు.

మోటకొండూరు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీఈవో కె.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించి మాట్లాడారు. పాఠశాలల్లో పరిసరాలను, దస్త్రాలను పరిశీలించారు. జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు గఫార్, పి.రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: గోదావరి జలాలు బిక్కేరు వాగులోకి మళ్లించి ఈ ప్రాంతంలో వరిచేలు ఎండిపోకుండా పంటలను కాపాడినందుకు గాను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి సింగిల్‌విండో ఛైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. గోవర్ధన్‌రెడ్డి, రైతులు ఓర్సు పురుషోత్తం, చెన్నయ్య, భిక్షంరెడ్డి, నర్సయ్య, పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాటం

రామన్నపేట, న్యూస్‌టుడే: కొమ్మాయిగూడెంలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం చేపట్టకుండా రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని దెబ్బతీసే సిమెంట్ పరిశ్రమకు రామన్నపేట పరిసర ప్రాంత ప్రజలు బలికావద్దన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, సిరిగి మల్లారెడ్డి, మేక అశోక్‌రెడ్డి, పల్లపు దుర్గయ్య, ఊట్కూరి నర్సింహ ఫజల్, నల్ల నరేందర్, గూని రాజు, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీటిసరఫరాలో నేడు అంతరాయం

భువనగిరి, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో ఒకరోజు అంతరాయం కలగనున్నట్లు మిషన్ భగీరథ భువనగిరి డివిజన్ కార్యనిర్వహణ ఇంజినీర్ కరుణాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుర్కపల్లి జీఎల్‌బీఆర్ ట్యాంకు నుంచి భువనగిరి మండలానికి వచ్చే పైపులైన్ మరమ్మతుల కారణంగా బుధవారం మంచినీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. భువనగిరి, ఆత్మకూర్, బీబీనగర్, మోటకొండూరు, వలిగొండ, రామన్నపేట, పోచంపల్లి మండలాల్లో గోదావరి నుంచి వచ్చే నీటిని సరఫరాలో నిలిపివేయనున్నట్లు తెలిపారు.

తప్పించుకు తిరుగుతున్న నేరస్థుడిని పట్టుకున్న పోలీసులు

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: శిక్షపడిన నేరస్థుడు బెయిల్‌పై బయటకొచ్చి గత మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతుండగా పట్టుకొని రామన్నపేట కోర్టులో మంగళవారం హాజరుపరిచినట్లు ఎస్సై డి.నాగరాజు విలేకరులకు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెల్దేవికి చెందిన గోలి శంకర్‌పై 2020లో ఓ పంచాయతీ విషయంలో అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి భువనగిరి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు రెండేళ్ల శిక్ష విధించగా, పై కోర్టులో అప్పీలు చేసేందుకు బెయిల్‌పై బయటకొచ్చాడు. మూడేళ్లుగా తప్పించుకొని తిరుగుతుండడంతో ఎస్సై డి.నాగరాజు ఆదేశానుసారం హెడ్‌కానిస్టేబుల్ రామనర్సయ్య, కానిస్టేబుల్ రజనీకాంత్‌లు పక్కా సమాచారంతో నేరస్థుడిని హైదరాబాద్‌లో పట్టుకొని స్థానిక స్టేషన్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.

బాలిక అదృశ్యం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని ఓ బాలిక అదృశ్యమైంది. పట్టణ శివారులోని ఇండస్ట్రీయల్ ఏరియాలో వలస కుటుంబానికి చెందిన 15 ఏళ్ల బాలిక కనిపించకుండా పోయినట్లు బాధిత కుటుంబ పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తెలిసిన వ్యక్తులను బాలికను కిడ్నాప్ చేసినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బాలిక కుటుంబం ఉంటున్న ఇండస్ట్రీయల్ ఏరియాతో పాటు, అనుమానిత ప్రదేశాల్లో సీసీ కెమెరాలను పోలీసుల పరిశీలించారు. బాలికను తీసుకెళ్లిన అనుమానితులను గుర్తించినట్లు తెలిసింది. ఎస్వోటీ బృందం రంగంలోకి దిగి మంగళవారం అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. బాలిక క్షేమంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసుల చర్య సరికాదు: గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదాద్రి ఏసీపీ రమేశ్‌కు వినతిని అందజేస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: భారాస కార్యకర్తలపై యాదగిరిగుట్ట పోలీసులు వివిధ కేసులు పెట్టి వేధించడం సరి కాదని డీసీసీబీ మాజీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలతో కలిసి మంగళవారం యాదాద్రి ఏసీపీ రమేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాపాడడానికి ప్రయత్నం చేసిన పార్టీ కార్యకర్తలపై పోలీసులు అరెస్టు చేసి, కారంచల్లి కొట్టడమే కాకుండా కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన మరవకముందే మండలంలోని మల్లాపురంలో కర్రె చంద్రశేఖర్ సామాజిక మాధ్యమంలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని, అతన్ని కూడా అరెస్టు చేయాలనుకోవడం దారుణంగా ఉందన్నారు. అతను లేక పోతే పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి అయిలయ్యను బలవంతంగా పోలీసులు తమ వాహనంలో తీసుకెళ్లి, తన కొడుకును చూపించమంటూ గ్రామాలు తిప్పుతూ బెదిరించడం దుర్మార్గంగా ఉందన్నారు. పదేళ్లు పరిపాలించిన భారాస పాలనలో ఇలాంటి దౌర్జన్యాలు ఎప్పుడు జరగలేదన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ ఇమ్మడి రాంచంద్రారెడ్డి, పుర ఉపాధ్యక్షుడు కాటంరాజు, కౌన్సిలర్ బూడిద సురేందర్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ గడ్డమీది రవీందర్, నాయకులు మిట్ట వెంకటయ్య, అంకం నర్సింహ, దావూద్, శ్రీశైలం, రేపాక స్వామి, బాబూరావు, కొడె మహేందర్, బాలయ్య, బీర్ల మహేశ్, రమేశ్, వీరేశ్, వాసు పాల్గొన్నారు.

ట్రిపుల్-ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని వినతి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్-భువనగిరి-గజ్వేల్ ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోయే రైతులు, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఓఆర్ఆర్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఆర్ఆర్ఆర్ నిర్మించాలన్న నిబంధనను ఉల్లంఘించారని, చౌటుప్పల్‌లో 28 కి.మీ. దూరంలోనే జంక్షన్ నిర్మించాలని ప్రతిపాదించారని కేంద్రమంత్రికి తెలిపారు. ఉత్తర, దక్షిణభాగాల్లో సమానంగా ఓఆర్ఆర్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2013 భూసేకరణ చట్టం ఉల్లంఘించి హెచ్ఎండీఏ పరిధిలోని పంటలు పండే సాగు భూములను, ప్లాట్లను స్వాధీనం చేసుకునేందుకు ప్రతిపాదించారని ఫిర్యాదు చేశారు. ట్రిపుల్ ఆర్ కోసం సేకరించనున్న భూమికి ప్రస్తుతం మార్కెట్‌లో రూ.2 నుంచి 5 కోట్లు ధర ఉందని, నష్టపరిహారంగా అందులో పది శాతం ప్రతిపాదించారని వివరించారు. భూములు, స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ ధర నష్టపరిహారంగా చెల్లించాలని కోరారు. దామోదర్‌రెడ్డి, జాల వెంకటేశం, రాములు, మల్లేశం, శ్రీశైలం, బోరెం ప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కళాశాలలు మూసివేసి నిరసన



చౌటుప్పల్‌లో నిర్వహిస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమానులు, విద్యార్థులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపకార వేతనాలు, కళాశాలలకు బోధనా రుసుముల బకాయిలు విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో శ్రీగాయత్రి, నలంద, మాతృశ్రీ డిగ్రీ కళాశాలలను మంగళవారం మూసివేసి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. డీఏవో శ్రీనివాసకుమార్‌కు వినతిపత్రం అందజేసి సంఘం ఎంజీయూ విభాగం సహాధ్యక్షుడు బత్తుల శంకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలకు, విద్యార్థులకు గత మూడేళ్లుగా భారాస ప్రభుత్వంలో రూ.4300 కోట్లు బకాయిలు ఉన్నాయని, తాము ప్రైవేటు కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఆ బకాయిలను విడుదల చేయడం లేదని చెప్పారు. భీమిడి సుభాస్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, ప్రిన్సిపల్స్ ఆంజనేయులు, విష్ణుకుమార్, మహేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, శివ, వెంకటేశ్, జంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భువనగిరి పట్టణం: ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయలు చెల్లించే వరకు నిరవధికంగా డిగ్రీ కళాశాలలను మూసివేస్తామని ప్రైవేటు డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు చిక్కా ప్రభాకర్ గౌడ్, దర్పెల్లి ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫీజు బకాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ప్రదర్శన, సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయలు చెల్లించని కారణంగా యాజమాన్యాలు ఆర్థికంగా చితికిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో యాజమాన్యాలు, ప్రతినిధులు మణిపాల్ రెడ్డి, నవీన్, కర్నాల శ్రీనివాస్, జహంగీర్, శ్రవణ్‌రెడ్డి, రాజు, నరేందర్, మల్లేష్, వెంకన్న, రమేష్, శ్యాంకుమార్, ధనుంజయ్ గౌడ్, మాటూరి శ్రీను, పాల్గొన్నారు.

బోధన రుసుంలు విడుదల చేయాలి.. భువనగిరి గంజ్: బకాయిలో ఉన్న బోధన రుసుంలు, ఉపకార వేతనాలు విడుదల చేసి విద్యార్థులు ఆటంకం లేకుండా విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ అన్నారు. భువనగిరిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు.